# ధ్యేయోన్ముఖంగా

జె. వి. సుబ్రహ్మణ్యం

జీవితంలో ధ్యేయం చాలామంది కుండవచ్చు; కాని ఆ ధ్యేయానికి జీవితం అంకితం చేయగలిగిన ధన్యజీవులు చాల తక్కువగా ఉంటారు. కమలాదేవి అలాంటి స్వల్పసంఖ్యాకుల్లో ఒకతె.

గౌరవ మర్యాదలు కలిగి, ఉన్నత కుటుంబానికి చెందిన కమలాదేవి అవివాహితగా ఉండిపోవటం విన్నా, ఉపాధ్యాయినీ వృత్తినవలంబించటం చూచినా విచిత్రంగా కన్పిస్తుంది. విచిత్రమేకాదు, విపరీతంకూడాను.

ఆరోజుల్లో 'మంచివాళ్ళ'నబడే యువకులు సైతం దార్లుకాశారు, ఆమెకోసం. పొంచులున్నారు; నర్మగర్భంగా సరస ప్రసంగాలు చేశారు; శృంగార చేష్టల నభినయించారు; మోజుపడి వెంటపడ్డారు.

అయితే, కమల అచంచల; మహాబల.

ఈ నాడు అల్లాంటివారిలో ఆమె ఊసుఎత్తుకొనేవారే తక్కువ. ఎన్నడైనా ప్రసంగవశాత్తు ఆమెపేరు వస్తే ఉదాత్తగౌరవ తరగ ఒక్కటి వీచి సంభాషణను సవ్య మార్గంలో నడిపిస్తుంది.

మొదటిలో వాళ్ళది నెల్లూరుదగ్గిరే ఓ కుగ్రామం. వాళ్ళనాన్న కొడుకుల చదువుల నెపంతో నెల్లూరికి మకాం మార్చాడు. చాల స్థితిపరులు. కొడుకులతోడి ఒక్కగా నొక్క కూతురైన కమలనుగూడా చదివించాడు. ఆ నాడు నెల్లూరు కాలేజీలో ఉన్న ఇంటర్మీడియట్ వరకు చదివిందావిడ. అందర్లో ఎక్కువ తెలివిగలదనే పేరు సంపాదించుకొంది అయాచితంగా.

ఇంటర్మీడియేటు సొంత మయ్యేంతవరకూ వివాహప్రయత్నమంటూ జరగలేదు. సంబంధాలు మాత్రం అసంఖ్యాకంగా వచ్చేవి. కాని వాళ్ళనాన్నగారు అమ్మాయిచదువు ముగియందే పెళ్లిచేసేది లేదనే తనవిస్పష్టనిర్ణయాన్ని చర్విత చర్వణం చేసేవాడు వచ్చినవారిలో నెల్లా.

ఒకనాడు కూతుర్ని దగ్గరగా పిలిచి 'అమ్మాయ్ - ఇంకేం, పెళ్ళిచేసుకుంటావా?' అన్నాడు వాళ్లనాన్న, పంతులుగారు.

కమల అలా కళ్లు ఓమారు పైకెత్తి దించి ఊరుకుంది. ఆ భాషాసంపర్కంలేని పంతులుగారు 'ఇంకా చదవాలని ఉందా అమ్మా' అన్నాడు, అమాయికతకు ఆప్యాయతను జత చేస్తూ.

'లేదు నాన్నా' అంది కమల.

'అయితే రేపు శ్రావణంలో ఆ మూడుముళ్లూ పడేలా చూస్తాను' అన్నాడు, ఒక్కగానొక్క కూతురుకీ తాను చేయబోయే వివాహం వైభవం ఊహించుకుంటూ.

ఓ క్షణ మాగి 'నాన్నా...' అంది కమల.

'ఏమమ్మా?'

'ఏంలేదు, ఆయనమాత్రం కట్నం తీసికోని వాడుగా ఉండాలి'.

కమలకి పెళ్ళికాలేదు అని ఋతుభ్రమణం ఆగలేదు. వసంతం తర్వాత హేమంతం, హేమంతం తరవాత వసంతం దొర్లిపోయాయి. ఆమె తనకి అసలు పెళ్లే అక్కర్లే దంది.

గ్రీష్మ కాసారంలా పంతులువారి ఎడద ఎండిపోయింది; వర్షాభ్రంలా భీభత్సమైంది ఆయన మనస్సు.

అంతవాడింకయ్యె కాటిదిక్కుకు కాళ్లు సాచాడు... మృత్యుదేవి అమృతహస్తం ఆయన శరీరాన్ని స్పృశించి, ఆశీర్వదించింది.

లోకులీ భయంకరవార్త నెల్లా గ్రహించారో, తన్మూలంగా కమలాదేవి ఎల్లాంటి క్లేశాభావ పరితప్త ఐందో వాకోటం నాకు కానిపని. నేనన గలిగిందల్లా చర్విత చర్వణంచేస్తూ ఆమె 'అచలిత' అనిమాత్రమే.

ఆమె తర్వాతిజీవితం ఏ పథం పట్టిందీ, ముందే చెప్పాను. లోకుల కుఠారాల్లాంటి కఠోర విమర్శ లోకవంక; తనకై, తన వివాహానికై

మృత్యుగహ్వరంలోకి జారబడుతూన్న నాన్న బాధ మరోవంక; దినదిన ప్రవర్ధమానమౌతూన్న 'సినిసిజమ్' ఇంకోవంక, కమలాదేవిని కృశింపచేస్తున్నా, ఆమె బి. ఏ. పూర్తిచేసింది. ఆ దందహ్యమాన హృదయంతోనే భవిష్యన్నిర్మాణం చేసికొంది. పర్యవసానంగా ఉపాధ్యాయినీ వృత్తి స్వీకరించింది బాలికా పాఠశాలలో, తన సిద్ధాంతప్రచారానికి అనువుగా.

ఏ సుముహూర్తాన ఆమె ఆ ధ్యేయదీక్షానిబద్ధఐందో, ఏ మహత్కారణాలు ఆమె నల్లా కదలించివేశాయో నాకు తెలీని విషయాలు' కాని ఒక్కటి మాత్రం చెప్పగలను. పిరికిగుండెలున్నవాళ్ళ నెన్ని ఉపన్యాసాలుగాని, ఉద్గ్రంథాలుగాని ధ్యేయోన్ముఖంగా చేయలేవు. స్థిర సంకల్పం ఉన్న మహితప్రజ్ఞులకి ఒక్క చిన్న మెఱుపులాంటి మాట చాలు, కదలించి ముందడుగు వేయించేందుకు.

రాయప్రోలువారి స్నేహలతాదేవి స్వశరీరాన్ని విసర్జించింది, లోకానికి గుణపాఠం నేర్పేందుకు; ఇక కమలాదేవి కోరికల్ని విడిచిపెట్టింది, అస్థిపంజరాన్ని ఉంచుకొని. స్నేహలతాదేవి భగవతిని ప్రార్థించింది, లోకానికి ముక్తి కలిగించమని; కమలాదేవి కన్యకా సముత్తైన కన్యల్లోని దేవత్వాన్ని అర్థిస్తూంది, వారిలో నిద్రాణమైయున్న త్యాగప్రకృతిని జాగృతిపరుస్తూ. ఆమెశిష్యులంతా 'కన్యలను బెండ్లియాడునో, కన్యతండ్రి యర్పణము సేయు శుల్కదివ్యాప్సరసను బెండ్లియాడునో, అకట, యీ పెండ్లికొడుకు' అనేవారే.

వర్షాభ్రం చూచి విలపించి పరువెత్తినకోకిలే, వసంతం చూచి కలగానం చేస్తుంది. పరిభ్రమణం కాలచక్రధర్మం.

# ఇండియా - జాతీయభాష

కాళూరి హనుమంతరావు

స్వాతంత్ర్యము వచ్చినది. ఆంగ్లభాష పోయి దేశభాషలలోనొకటి రాజభాష కావలసియున్నది. కాని భారతదేశములో అనేకభాషలు గలవు. మాండలిక భేదములగూడ లెక్కపెట్టినచో దాదాపు యిరువది భాషలు గలవని చెప్పుదురు. ఇన్నిభాషలు గల దేశమునకు జాతీయభాష నొకటి యేర్పఱచుట సాధ్యమా? అను శంక యుదయించినది. కాని భారతదేశపుభాషలకన్న హెచ్చుభాషలుగల దేశములు ప్రపంచములో లేకపోలేదు. రష్యాలో నూటయేబది భాషలుగలవు. కాని రష్యాకొకటే జాతీయభాష యున్నది. దీనినిబట్టిచూడ మనదేశమునకుగూడ ఒకజాతీయభాష నేర్పాటుచేసుకొను వీలున్నదని స్పష్టమగుచున్నది.

కాని దేశమందలి భాషలు రెండు భాగములుగా విభజింపబడి యున్నవి. ఉత్తర దేశభాషలన్నియు నొకపోలికయు, దక్షిణదేశ భాషలు వేఱొకపోలికయు కల్గియున్నవి. ఈ కారణముచే హిందూదేశము రెండుభాషలను రాజభాషలుగా పరిగణించిన చిక్కులేదని ఒకమతము. కాని ఇది మఱల దేశవిభజనకు మార్గము చూపుపద్ధతి యగును. అట్లగుట భారతదేశమున కంతకు వొకే రాజభాష యుండవలయును.

భారతదేశ భాషలలో నే భాషను రాజభాషగా స్వీకరించుట? అనునది మఱియొక శంకగా నేర్పడినది. కొందఱు హిందీయనియు, హిందూస్థానీయని కొందఱును, సంస్కృతమని మఱికొందఱును తగవులాడుచున్నారు. ఇవియన్నియునుగాక ఆంగ్లమునే యుంచిన బాగని వేరొకమతము. వీటిపై వాదోపవాదములు నిరంతరము జరుగుచునే యున్నవి.

నిజమునకు హిందూదేశ భాషలలో హిందీకున్న స్థానము మఱే యేభాషకును లేదనియే చెప్పవచ్చును. ఉత్తర హిందూదేశములో అధిక సంఖ్యాకులు మాట్లాడు భాష యిది. దక్షిణ దేశవాసులనుగూడ వశముచేసుకొను చున్నది. మొత్తముమీద దాదాపు 22.2 కోట్ల భారతీయు లర్థము చేసికొను భాషయై యున్నది.